బురద, ముళ్లపొదలతో ఇబ్బందులు


బురదమయంగా మారిన నడికూడ పెద్ద చెరువుకట్ట (ఫైల్)


పెద్ద చెరువుకట్టపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

- నడికూడ పెద్దచెరువు ఆకయకట్టు కింద 200 ఎకరాల్లో పంటసాగు
- కట్ట మరమ్మతులు చేయాలని రైతుల డిమాండ్

నడికూడ : వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఆ చెరువు కట్టపై నుంచి ప్రయాణం సాగిస్తుంటారు. అయితే కట్టకిరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, కట్ట బురదగా మారడంతో కొన్ని రోజుల నుంచి ఆ కట్టపై నుంచి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువుకట్ట దాదాపు కిలో మీటర్‌కు పైగానే ఉంటుంది. ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు 200 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే కొన్ని రోజుల నుంచి చెరువుకట్టను సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో, కట్టకిరువైపులా ముళ్ల చెట్లతో పాటు, మట్టి, బురద గుంటలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకట్ట చిత్తడిగా మారడంతో కాలి నడక కూడా ఇబ్బందిగా ఉందని పలువురు రైతులు అంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామస్తులు ఎడ్లబండి, ట్రాక్టర్, ఇతర వాహనాల ద్వారా ఈ కట్టపై నుంచి రాకపోకలు సాగిస్తుంటామని ముళ్లపొదలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

ముళ్లచెట్లు తొలగించాలి



పెద్ద చెరువుకట్టకిరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. ఎడ్లబండిపై వెళ్లినా గాయాలు తప్పడం లేదు. వర్షం కురిస్తే కట్ట పూర్తిగా బురదమయంగా మారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించి కట్టపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి.

- నారగని రాకేశ్, నడికూడ

వర్షం కురిస్తే ఇబ్బందులు



నాకు పెద్దచెరువు ఆయకట్ట కింద వ్యవసాయ భూమి ఉంది. తేలికపాటి వర్షానికి కట్ట బురదమయంగా మారుతుంది. దీంతోపాటు ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో పొలాల వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

- శ్రీను, రైతు, నడికూడ

దేశానికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం


జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

కమలాపూర్ : దేశానికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే లిఖించదగినదని, ఆ చరిత్రను హిందూ, ముస్లింల నడుమ జరిగిన యుద్ధమని విష ప్రచారం చేయడం అవివేకమన్నారు. నాటి ఉద్యమంతో సంబంధం లేని బీజేపీకి మాట్లాడే అర్హత లేదన్నారు. నిజాం రాజుల పాలనలో ఆనాడు ప్రజలు జీవించే హక్కును కాలరాస్తున్న దొరల ఆగడాలకు, గ్రామాల్లో వెట్టిచాకిరీ, బానిసత్వానికి తెలంగాణ రైతాంగం, ప్రజలు ఎదురు తిరిగారని గుర్తుచేశారు. పీడిత ప్రజలకు అండగా ఉండి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ వంటి 4,500 మంది కమ్యూనిస్టులు రక్తం చిందించారని, వారిని స్మరించుకునేందుకు సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండల కార్యదర్శి ఓదెలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజుగౌడ్, మండల సహాయ కార్యదర్శులు మహేందర్, బాలరాజు, ఐలయ్య, సుధాకర్, నాయకులు రామ్మూర్తి, లచ్చయ్య, లక్ష్మి, రాణి, రవి పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో నివాసముంటున్న లావుడియా కమల(35) పాము కాటుకు గురై మంగళవారం మృతి చెందింది. ముల్కనూరు ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం దేశరాజుపల్లికి చెందిన కమల–రమేశ్ దంపతులు బతుకుదెరువు కోసం వచ్చి కొత్తపల్లి శివారులో ఉంటున్నారు. ఈక్రమంలో మంగళవారం ఇంట్లో నిద్రిస్తుండగా కమలను పాము కాటేసింది. భర్త రమేశ్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా కమల మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. కమలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

ఐనవోలు: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని రాంనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్ర సాంబరాజు(41) గీత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వృత్తిలో భాగంగా మంగళవారం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య సంధ్య, కుమారుడు సిద్ధు, కుమార్తె సిరి ఉన్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు


శాయంపేట : రైతు వేదిక ఎదుట టోకెన్లతో నిరసన తెలుపుతున్న రైతులు


కమలాపూర్ : ఉప్పల్‌లో యూరియా కోసం క్యూలో పెట్టిన ఖాళీ బీరుసీసా

శాయంపేట : రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో మంగళవారం స్థానిక రైతు వేదికలో ఏఈఓ సునీల్ 200 మంది రైతులకు యూరియా టోకెన్లు అందించారు. టోకెన్లు పొందిన రైతులు శాయంపేట ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి చేరుకోగా యూరియా బస్తాలు మధ్యాహ్నం పంపిణీ చేస్తామని ఆగ్రోస్ సిబ్బంది తెలిపి ముగ్గురు రైతులకు మాత్రమే మూడు యూరియా బస్తాలు అందించారు. పెద్దకోడెపాక, పత్తిపాక గ్రామాల రైతులు ఒక్కసారిగా చేరుకోవడంతో తోపులాటకు దారితీసింది. దీంతో ఎస్సై పరమేశ్ సిబ్బందితో అక్కడకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. రోజుకో గ్రామానికి చెందిన రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని, లేనిపక్షంలో గొడవలు జరిగే అవకాశం ఉందని చెప్పడంతో రెండు రోజుల తర్వాత ఏఓ ఏ గ్రామానికి యూరియా కేటాయిస్తే ఆ గ్రామానికి పంపిణీ చేస్తామని చెప్పి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం యాజమాని యూరియా పంపిణీ నిలిపివేశారు. దీంతో రైతులు టోకెన్లతో రైతు వేదిక ఎదుట నిరసన తెలిపారు.

యూరియా క్యూలో ఖాళీ బీరుసీసా

కమలాపూర్ : యూరియా వచ్చిందంటే చాలు పనులన్నీ వదులుకుని కుటుంబ సమేతంగా బారులుదీరడం, క్యూలో చెప్పులు, పాస్‌పుస్తకాలు పెట్టడం పరిపాటిగా మారింది. మండలంలోని ఉప్పల్‌కు మంగళవారం 444 బస్తాల యూరియా చేరుకోగా రైతు వేదిక వద్దకు రైతులు పెద్దెత్తున చేరుకొని క్యూలో చెప్పులు ఉంచారు. కొందరు రైతులు మాత్రం చెప్పులతో పాటు ఖాళీ బీరు సీసాలు, వాటర్ బాటిళ్లను క్యూ ఉంచారు. ఇది చూసిన పలువురు రైతులు ముక్కున వేలేసుకున్నారు. అధికారులు ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

మాజీ సర్పంచ్‌కు మాతృవియోగం


ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పడిదల సమ్మారావు తల్లి పడిదల సోమక్క(75) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సోమక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ

వేలేరు : ధర్మసాగర్ మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు తల్లి సక్కుబాయి ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అనంతరం సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, నాయకులు ప్రభుదాస్, కుమార్, మనోజ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సోమిరెడ్డి, గణేశ్, సురేష్, వీరయ్య, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

దేవాదుల కెనాల్ గండి పూడ్చివేస్తాం

- ఏఈ అరవింద్


దేవాదుల కాల్వ గండిని పరిశీలిస్తున్న ఏఈ

ఎల్కతుర్తి : దేవాదుల నార్త్ కెనాల్ గండికి మరమ్మతులు చేపట్టి పూడ్చివేస్తామని దేవాదుల ఏఈ మర్రి అరవింద్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని విశ్వనాథ కాలనీ సమీపంలో ధ్వంసమైన దేవాదుల నార్త్ కెనాల్ కాల్వను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. నీరు వృథాగా పోకుండా కాల్వ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి 20రోజుల్లో పూర్తి చేస్తామని అన్నారు. రైతులకు నష్టం జరుగకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట సిబ్బంది రఫీ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'చర్య తీసుకోవాలి'

ఐనవోలు : పెరుమాండ్లగూడెంలో బెల్టుషాపు నిర్వాహకురాలు తనపై దాడి చేసిందని, ఆమెపై చర్య తీసుకోవాలని పొన్నాల కౌసల్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెల్ట్‌షాపులో మద్యం తాగిన మందుబాబులు గ్లాసులు పడేయడంతో కొంతమంది రాత్రి సమయంలో మూత్ర విసర్జన చేస్తున్నారని, దుర్వాసన వస్తుందని ఇంటిపక్కన బెల్టుషాపు నడుపుతున్న మహిళను నిలదీసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో బెల్టుషాపు నిర్వాహకురాలు తనపై దాడి చేసిందని తెలిపారు.

'అమ్మ కోసం ఒక మొక్క'



శాయంపేట : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తల్లితో కలిసి మొక్కలు నాటారు. 5వ తరగతి చదువుతున్న ఆరుట్ల ఆర్యన్ తన తల్లితో కలిసి శ్రీమత్స్యగిరి స్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్యాతండాలో డిజిటల్ క్రాప్ సర్వే



వేలేరు : వర్షాకాలం పంట సాగు నమోదు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఏఈఓ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని లోక్యాతండా గ్రామ పంచాయతీలో మంగళవారం డిజిట్ క్రాఫ్ సర్వే చేపట్టినట్లు తెలిపారు. సర్వే నంబర్ల వారిగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను యాప్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెట్లతీగల తొలగింపు





శాయంపేట : మండలంలోని తహరాపూర్, పత్తిపాక గ్రామ శివారుల్లోని పలు గ్రామాల్లోని పంట పొలాల సమీపంలో గల విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా ఉండగా మంగళవారం సాక్షి దినపత్రికలో 'విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ సిబ్బందితో చెట్లతీగలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షికి పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా విద్యుత్ సమస్యలుంటే తెలుపాలని స్థానికులకు విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.

క్లుప్తంగా

రేపు ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఎంపికలు

ఎల్కతుర్తి : మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపికలను కార్మెల్ స్కూల్‌లో గురువారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ చదువుల సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు అండర్–14లో క్రీడలు ఆడేందుకు 2012లో, అండర్–17లో క్రీడలు ఆడేందుకు 2009లో జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

భీమదేవరపల్లిలో..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈఓ సునీతారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 17,18 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడలు అండర్–14, అండర్ –17 బాల, బాలికలు అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికవుతారని తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కొంక అశోక్ ససూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలానీబాబా దర్గా వద్ద జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని పలువురిపై చర్య తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు కెళ్లడం తప్పదని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెంట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఏఎస్సైలు యాకయ్య, రమేశ్ ఉన్నారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ



నడికూడ : మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయాన్ని ఇటీవల పునః నిర్మాణం చేపట్టారు. కాగా మంగళవారం పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన పూజారి నాగరాజు పంచలోహ విగ్రహాలను దేవాలయ కమిటీ సభ్యులకు అందించారు. కమిటీ సభ్యులు దేవేందర్, లింగయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రాత పరీక్షతో నియామకం చేపట్టాలి

పరకాల : ఆర్టీసీ సంస్థ నూతన ఉద్యోగుల నియామకంలో ఏలాంటి పైరవీలకు అస్కారం లేకుండా రాత పరీక్షతో నియామకం చేపట్టాలని స్వేరో స్టూడెంట్ నాయకుడు రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

ఉత్సాహంగా కళా ఉత్సవ్



నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కళా ఉత్సవ్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ఉపాధ్యాయులు దేవ, రాజుకుమార్, సత్యపాల్, అక్షయ, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం

ధర్మసాగర్ : పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తప్పదని పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా నాల్గో రోజు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో మంగళవారం ఉదయం స్వచ్ఛభారత్ నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేక ఉపన్యాసం విజయ్ కుమార్ మాట్లాడుతూ.. కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధించవచ్చన్నారు. జీవితంలో సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం అధికారి కవిత, రామారత్నమాల, డాక్టర్ మమతా, డాక్టర్ అరుణ, డాక్టర్ మాధవి, వలంటీర్లు, అధ్యాపకులతో పాటు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని కాంట్రాక్టర్, ప్రిన్సిపాల్‌ను అడిగితెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు భవన నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు.

దసరా పండుగ ఏర్పాట్లు చేయలేం

- పంచాయతీ కార్యదర్శుల వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎల్కతుర్తి : దసరా పండుగ ఏర్పాట్లకు నిధుల కొరత వేధిస్తోంది. గ్రామ పంచాయతీల్లో సరిపడా నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పండుగ ఏర్పాట్లు చేయలేమని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. భీమదేవరపల్లి మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీఓ వీరేశానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పారిశుద్ధ్యం, ట్రాక్టర్ నిర్వహణ ఖర్చులు, విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు, రోజువారి ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. దీంతో దసరా నిర్వహనకు లైటింగ్, ఇతర ఏర్పాట్లు మరింత కష్టం అవుతుందని వాపోయారు. వినతిపత్రం అందించినవారిలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఎంపీఓ నాగరాజు ఉన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి

- ఆర్డీఓ రమేశ్ రాథోడ్


రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్

ఎల్కతుర్తి: గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ నిర్మాణం కోసం రైతులు భూములు ఇవ్వాలని హనుమకొండ ఆర్డీఓ రమేశ్ రాథోడ్ కోరారు. మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముస్తాఫాపూర్, మల్లారం, ముత్తారం గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ సేకరణకోసం రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ భీమదేవరపల్లి మండలంలోని 10 గ్రామాల్లో సుమారు 40 కిలోమీటర్ల మేర కెనాల్ నిర్మాణానికి కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. కెనాల్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాజేశ్, డీటీ చైతన్య రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి


మాట్లాడుతున్న క్రాంతికుమార్

శాయంపేట : ప్రతిఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండి ఈ–కేవైసీ చేసుకోవాలని ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ కౌన్సిలర్ క్రాంతికుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ బ్యాంకుల వద్ద అధిక వడ్డీతో రుణాలు తీసుకుని ఇబ్బందులు పడొద్దని, ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే లావాదేవీలు జరపాలని అన్నారు. తద్వారా అధిక వడ్డీ నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వ్యక్తిగత ప్రమాద బీమా, ఆరోగ్య బీమాలను ప్రతి ఖాతాదారుడు కలిగి ఉండాలని అన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు పంపించిన లింకులను ఓపెన్ చేయొద్దని, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ ఇతర వివరాలు చెప్పొద్దని సూచించారు. ఎస్‌బీఐ అధికారులు విజయ్ కుమార్, మనోజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిగ దిగుబడి

- ఏడీఏ ఆదిరెడ్డి


కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, ఏడీఏ ఆదిరెడ్డి, తదితరులు

ఐనవోలు : పంటసాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏడీఏ ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముల్కలగూడెం గ్రామంలో వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ శాస్త్రవేత్తలు వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ రాములు, డాక్టర్ గోనియా నాయక్, డాక్టర్ పద్మజ, డాక్టర్ భార్గవి పత్తి పంటలో పారావిల్ట్, తల మాడు తెగులును గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో గొడ్డు మోతు తెగులు అక్కడక్కడ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో ఉల్లికోడు, గొట్టలు వస్తున్నట్లు చెప్పారు. రైతులు తప్పనిసరిగా ఫిప్రోనిల్ 5శాతం, ఈసీ 2ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు చీడపీడలను గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకొచ్చి తగిన పురుగు మందులను పిచికారీ చేసుకుని పంటలను రక్షించుకోవాలని అన్నారు. ఏఓ సునీల్ కుమార్, ఏఈఓ అఫ్రీన్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణహిత ఉత్పత్తులు వాడాలి


మాట్లాడుతున్న సురేష్

ధర్మసాగర్ : ప్రతిఒక్కరూ పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించాలని ఉపాధ్యాయుడు సురేష్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొర క్షీణత మానవాళికి ముప్పు అనే అంశం, వైజ్ఞానిక సదస్సును ప్రధానోపాధ్యాయులు ధర్మప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ.. ఓజోన్‌పొర భూమిని హానికరమైన అల్ట్రా వైలెట్ కిరణాల నుంచి రక్షిస్తుందన్నారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్లు, ఇతర హానికర వాయువులు ఓజోన్‌పొరను నాశనం చేస్తుందని, దానివల్ల జీవావరణం దెబ్బతిని ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. అందుచేతనే ప్రతిఒక్కరూ పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.